# జమీందారుని కొడుకు

(శారద - ఏప్రిల్ 1923)

(1)

**ఆ**షాఢస్య ప్రథమ దివసమునందు మేఘము భాగ్యవంతుడయిన యక్షునికి కాక యందరకు కనబడునా? ఆషాఢము బహుళపక్షము వచ్చినను ఎండలు మండిపోవుచున్నవి. పున్నమ్మ యథాప్రకారముగ గవాక్షము వద్ద నిలుచుండి బయట రాజమార్గము వంక చూచుచునే యున్నది. ఆమె కన్నులలో పిచ్చియు, శూన్యతయును తోచుచునే యున్నవి. పది గంటలయినది. బెజవాడ నుండి మెయిలు వచ్చినది. పున్నమ్మ దీర్ఘనిశ్వాసము హృదయాంతరాళము బీటవారిచినది.

పున్నమ్మ పేదయింటి బిడ్డ. ఆమె పుట్టిల్లు దూరము. కొంత ధనము పుచ్చుకొని యామె తండ్రి యామెను రాజారావునకి ఇచ్చెను. ఆమె కాపురమునకు వచ్చిన కొలదినాళ్ళలో ఆమె తండ్రి పరలోకగతుడైనాడన్న వార్త వచ్చినది. తల్లి విషయము తెలియలేదు.

రాజారావు చిన్నప్పటినుండి తన మేనమామ యింట పెరిగినాడు. అతని తల్లిదండ్రులు చిన్ననాడే గతించిరి. మేనమామ యతనిని పెంచి పెద్దవానిని చేసి తన కూతురునిచ్చి వివాహము చేయుదమనుకొనినాడు. మేనమామ భార్య ఆస్తిలేని వానికి తన కూతురు నొసగుట కిష్టము లేక పరాయి సంబంధము తెచ్చినది. కాని మేనమామ-మేనల్లుని అతని భార్యను తన యింటనే యుంచుకొని మేనల్లునికి చదువు చెప్పించుచుండెను. రాజారావు ఎఫ్.ఎ. రెండుసార్లు తప్పినాడు. మేనమామకు కొంచెము కష్టముగానే యున్నది. దినదినము విస్తరిముందర రాజారావునకు గండము. సరిగా భార్యతో నొక్కదినమైన మాట్లాడలేదు. ఎరిగియున్న వారందరు నేదైన యుద్యోగమున ప్రవేశించుమని చెప్పువారలే.

రాజారావున కొక యూహ పుట్టినది. తాను ఇంగ్లండునకు పోయి యేదియో గొప్ప పరీక్ష యయివచ్చెనా, వచ్చిన వెంటనే తనకు మంచి యుద్యోగము కుదురును.

ఒక స్నేహితుడు ఇంగ్లాండునకు పోవుచు రాజారావును తీసికొనిపోయెను. రెండు సంవత్సరములలో తిరిగి వచ్చెదను గదా అని రాజారావనుకొన్నాడు. పున్నమ్మ తన మగని మేనమామ యింట నున్నది.

ఆయింట నామెయెవరు? కూతురా కోడలా? దగ్గర చుట్టమా? రాజారావుండగానే పున్నమ్మకు చేయీసడింపులు బాగుగ తగులుచుండెడివి. ఇప్పుడామె పని దానికన్న కనాకష్టము. అన్నము విస్తరిలోనికి వచ్చుసరికి యెంత జాతర!

రాజారావు వెళ్ళి రెండు సంవత్సరములైనది. మూడు దాటినది. నాలుగు గడచినది. ఇప్పుడతని వద్దనుండి యుత్తరములే లేవు. కొందరతడు చనిపోయినాడని, కొందరేమయి పోయినాడో యెవరికి తెలియునని, యట్లనియిట్లని పరి పరివిధములు.

**(2)**

పున్నమ్మ యింటిల్లిపాతికి చాకిరి చేసి యా గవాక్షము వద్ద నిలుచుండును. ప్రతి రైలుబండియు నిరాశావార్త తెచ్చినపుడెల్ల జారు బాష్పబిందువులు బందరునకు పునర్జల ప్రళయమునే తెచ్చుచున్నవా!

ఇప్పుడు పున్నమ్మకు సగము పిచ్చి, సగము ప్రపంచక జ్ఞానము, ఇంటిలోనన్ని పనులును మిక్కిలి శ్రద్ధతో నత్తింటి కోడలి వలె చేయును. ఎవరితో మాటలాడదు. పొరుగమ్మల ప్రశ్నలకు పిచ్చి జవాబులు, పున్నమ్మ యేవిధముగా వదలునా యను నాలోచన ఆమె మగని మేనమామ భార్యకు వదలినది కాదు. ఎవరితోనైన నామె యిదియే ప్రసంగము. కొందరు 'రోగమా! చాకిరి చేయించుకొనుచు నింతకూడు పెట్టలేదా?' అని చాటున నంటారు. కొందరు 'అవును, కష్టము గాదటమ్మా! ఒక మనిషి బరువు మోసిన తెలియు'నని యామె పక్షమవలంబింతురు.

రాజారావు ఎవరితో నింగ్లాండునకు వెళ్ళినాడో యాయన తిరిగి వచ్చినాడని తెలియగా నతని మేనమామ రాజారావు సంగతి కనుగొనుటకు వెళ్ళినాడు. పున్నమ్మకు కొంచెము జాగ్రదవస్థ వచ్చినది.

ఆయన వచ్చి వాకిట నిలువబడినాడు. భార్య తొందరగా ప్రశ్న వేసినది.

"ఏమైనది?"

ఆయన ఊరుకొని విచారించుచున్నట్లు నటించినాడు.

"చనిపోయినాడా?"

పున్నమ్మ కన్నులలో నడ్డపాపలు తిరిగినవి.

**భార్య :** ఏమయినాడో చెప్పరు?

**భర్త :** ఎవతెనో యొక హోటలు దానిని పెండ్లి చేసుకొన్నాడట. దానితోనే ఉన్నాడు.

అప్పటి, యాయన భార్య ప్రవర్తన వ్రాయుటకు నా 'పాళి' తిరుగలేదు. కొంతసేపటికి మఱల 'ఇప్పుడెక్కడ నున్నాడో తెలియునా?'

"తెలియదు"

ఆనాడు సంజనీడలు నలు పెక్కులోన రాజారావు పున్నమ్మలు కుంకుడు వ్రేళ్ళతో పెల్లగింపబడిరి. మఱునాటి నుండి యా యిల్లు పున్నమ్మకు నరకమైనది. 'ఇంకొక్కళ్ళయితే ఏ నూతిలోనన్నా పడి చావరటమ్మా'(అన్నది యిన్స్పెక్టరు గారి భార్య)

**(3)**

చైత్రము క్రొత్త మల్లెలతో నవఘుళించినది. శ్రీరామ నవమికి తెలుగుదేశము నాలుగు మాసాలనుండి జనమొత్తుకొని భద్రాద్రికి పోవుచున్నది. భద్రాద్రి యడవులలో బండ్లు వరుసగా బోవుచున్నవి. ఒక బండిలో నుండి పున్నమ్మ దిగినది. త్రోవకు పెడగా నరిగినదో లేదో బండ్లు గూపులు వేయించుకొని పోయినారు. పున్నమ్మకు బండ్లందలేదు. ఆ యడవి దారులు వేనవేలు. అందులో నొక దారిని పడి పున్నమ్మ యొక విజనస్థలమున నిలువబడినది.

రాజారావు మేనమామ పున్నమ్మ నింటివద్ద నుంచి పోవుదమన్నాడు. ఆయన భార్య యిందు కనియే కాబోలు నామెను వెంటగొని వచ్చినది.

* * *

అడవులలో బ్రొద్దు గ్రుంకకముందే ప్రొద్దు గ్రుంకును. ఆ త్రోవలు చిత్రములు. ప్రతిమార్గము పశుపాద ఘాతములచే త్రొక్కుడు పడినదే. కాని యేదియు మార్గము కాదు. పున్నమ్మ యా యడవిలో నొక చెట్టు క్రింద నిలువబడినది. ప్రక్కనున్న వాగులోని యూటనీరు నలుపులు గ్రక్కుచున్నది.

పున్నమ్మ నల్లనిదే గాని యామె మొగము ప్రసన్నతాసీమ. ఆ కనుల వంపులు సౌందర్యభాగధేయములు, ప్రబంధము కాదు వనదేవత యని వర్ణించుటకు.

ఒక అడవి కోడి దేనిచేతనో తఱుమబడి దారికడ్డముగా గూయుచు పరుగెత్తినది. పున్నమ్మ గుండె చెదరినది. ఇంక చీకట్లు క్రమ్ముచున్నవి.

దూరమున మనుష్యులు వచ్చుచున్నట్లయినది. దారిలేక గుఱ్ఱము నడిపించుకొనుచు వొక సేవకుడు, తోడుగా నొక యౌవనుడు వెనుక వచ్చుచు, నిరువురు పున్నమ్మను చూచి నిలచిపోయిరి.

**యౌవనుడు :** 'ఎవరు నీవు?'

జవాబు లేదు

"ఎక్కడకు బోవుచున్నావు?"

"భద్రాద్రికి"

"ఇది భద్రాద్రిత్రోవ కాదు"

"త్రోవ తప్పితిని"

"నీవొక్కతెవా?"

"ఒక్కతెనే"

"దారిలో ప్రవేశపెట్టుదము వెళ్ళెదవా?"

"ఎక్కడకు?"

యౌవనుడు నిదానించి చూచినాడు. అతని కన్నులు ముగ్ధములై పోయినవి.

"మా వెంట వచ్చెదవా?"

ఆయమ నిరుత్తర; అథోముఖ యౌవనుడు సమీపించినాడు ఆమె చెక్కిళ్ళు భాష్ప బిందువులచే వసివాడి పోయెను.

యౌవనుడామెను ముందు నడువుమని చెప్పి – తాను వెనుక, సేవకుడు ముందుగా బోవుచుండిరి. పున్నమ్మ కాళులు మార్గమునకు తెలియకుండగనే తాళములు వేసినవి. దూరమై యంతంతకు వారాయంధకారమయ మయిన యాయడవిలో నగోచరులైరి.

భద్రాద్రి కింకొక మార్గమున్నది. పాపికొండల వద్ద గోదావరిలో పడవలు సుళ్ళు తిరుగును. అట మునిగి యధఃపాతాళమునకు బోవచ్చును. బాటసారుల పుణ్యలేశమున భద్రాద్రికి జేరవచ్చును.

**(4)**

శరన్మేఘపు తెల్లతునక లాకాశమున యేకులవలె ప్రకాశించుచుండెను. చెన్నపురిలో సాయంతనమున సముద్రపు టొడ్డునకు షికారునకు వచ్చుట పెద్దమనుష్యుల కలవాటు. గొప్పయింటి యాడువాండ్రు కూడ బండ్లమీద నెక్కి వచ్చుచుందురు.

ఆనాడొక జమీందారుని భార్యయు, నామె యేడాది కొడుకును సముద్రపు టొడ్డునకు మంచిగాలి పీల్చుటకు వచ్చిరి. బండి రోడ్డుమీదనే దిగి సముద్రపు నీటి యంచువఱకు బోయి యామె యందు నిలబడినది. కుఱ్ఱవాడు చంకలోనుండి క్రిందికి జాఱుచుండినను నామె వానిని గట్టిగా బట్టుకొన్నది.

ఆ సముద్ర మామెలో నొక చిత్రమైన కలవరము పుట్టించినది. ఇంతలో ప్రొద్దుగ్రుంకినది. కొంతసేపటిలో నాయొద్దున నెవరును లేరు. రాణియు, నామె పుత్రుడును మిగిలినారు. వెన్నెల పిండియారబోసినట్లున్నది. దానిలో సముద్రపుటిసుక తళతళ లాడినది. ఆ శారదచంద్రికలో క్షీరసాగర గర్భవీచికలు మెఱుగెక్కినవి.

దూరమున నుండి యెవరో యొకపూరుషు డారాణీ వద్దకు వచ్చి నిలబడెను. రాణి యాయన వంక జూచినది. వారలిరువురకు నేదియో పూర్వస్మృతి కలిగినట్లున్నది. ఇంచుకయైన నెడములేని గాఢాలింగనములో వారలిర్వురు లీనమైపోయినారు.

రాణి చంకనున్న బిడ్డడు జారి సంద్రపు కెరటాల పైకి దొరలి వానిమీద తేలిపోవుచు చంద్రకిరణములతో నాడుచున్నాడు.

రాజారావు వెళ్ళి యిది యెనిమిదవయేడు, ఆ మహానందములో జమీందారు కొడుకు మాట పున్నమ్మకు జ్ఞాపకము రాలేదు. ఆ గాఢాలింగముననే వారిరువురు నాశరత్కాలపు శీతలస్వచ్ఛజ్యోత్స్నలో బడి దూరపు నీలరేఖాంగణముల యందంతరించి పోయినారు.